# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- పంచసూత్రాలు, అగ్రిటెక్ ద్వారా వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- రాష్ట్ర వ్యవసాయ రంగం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా త్వరలో 'నంది నాటకోత్సవాలు' నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.
- ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

====================

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. వ్యవసాయ రంగం బడ్జెట్‌పై ఈరోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయంలో జాతీయ జీడీపీలో ఆంధ్రప్రదేశ్ కి పదిశాతం వాటా ఉందన్నారు. పంచసూత్రాలు, అగ్రిటెక్ ద్వారా వ్యవసాయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలియజేశారు. డిమాండ్ ఉన్న పంటలను పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరాలకు విస్తరించేలా చర్యలు చేపడుతున్నామని, ఆంధ్రప్రదేశ్ ను ఆక్వా కల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. రైతులకు పూర్తిగా అండగా నిలుస్తామని, కౌలు రైతులను కూడా ఆదుకునేలా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

రాష్ట్ర వ్యవసాయ రంగం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు శాసనసభలో వ్యవసాయం, అనుబంధ శాఖలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం నిజమైన స్వర్ణయుగాన్ని పొందిందన్నారు. రైతులకు నేరుగా లాభాలు, ఆధునిక సాగు పద్ధతుల, పంటల మార్కెటింగ్ సౌకర్యాలు వంటి సమగ్ర పథకాలు రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమగ్ర ప్రగతి దిశగా తీసుకెళ్లి 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, ప్రజల తలసరి ఆదాయాన్ని 43 వేల డాలర్లకు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం "స్వర్ణాంధ్ర - 2047" ప్రణాళికను రూపొందించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి కేంద్రబిందువుగా భావించి కనీసం 15 శాతం వార్షిక వృద్ధి సాధించాలనే స్పష్టమైన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

కేంద్రప్రభుత్వ పిఎం ఉష పథకం నిధులతో తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ఉపకులపతి, ప్రొఫెసర్ వి.ఉమ ఈరోజు ప్రారంభించారు. రేపు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మహిళా విశ్వవిద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఉమ మాట్లాడుతూ, శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం కోసం సైన్స్ ఎగ్జిబిషన్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విప్లవాత్మకమైన ఆవిష్కరణలతో ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు.

====================

విరామం

====================

రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేలా పర్యాటక, చలనచిత్ర అభివృద్ధి సంస్థ, డిజిటల్ కార్పొరేషన్లు సమన్వయంతో పనిచేయాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈరోజు వెలగపూడి సచివాలయంలోని అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు, టీవీ, థియేటర్ అవార్డులు, కందుకూరి పురస్కారాలను త్వరలో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి జ్యూరీ ఏర్పాటు, వేదికలు, తేదీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించేలా నూతన ఫిల్మ్ పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

====================

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి ఈ ఏడాది బడ్జెట్లో 600 కోట్ల రూపాయలు కేటాయించినట్లు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈరోజు అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. బడ్జెట్లో కేటాయించిన మొత్తంలో 500 కోట్ల రూపాయలను పనులకు, మరో 100 కోట్ల రూపాయలు భూసేకరణకు కేటాయించామని చెప్పారు. సుజల స్రవంతి తో పాటు, ఉత్తరాంధ్రలో ప్రాధాన్య క్రమంలో మరో 11 ప్రాజెక్టులు గుర్తించి వాటికి మరో 460 కోట్ల రూపాయలు కేటాయించామని రామానాయుడు వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2014-19లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని, ఈ పథకం ద్వారా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు.

(వాయిస్...30 సెకన్లు)

====================

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సుపోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి మొత్తం 76 గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక కాగా, అత్యధిక అవార్డులు తూర్పుగోదావరి జిల్లాకు లభించాయన్నారు. కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి పూర్తి అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఏప్రిల్ 2వ తేదీన న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక 'భారత్ మండపం'లో జరిగే జాతీయ 'సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్' సత్కార వేడుకలో ఈ విజేత పంచాయతీలకు అవార్డులను అందజేయనున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

====================

రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ స్కోచ్ అవార్డు ఆప్కోకు లభించిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత ఒక ప్రకటనలో తెలిపారు. నేతన్నలకు ఆర్థికభరోసా కలిగించేలా సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు వారికి 365 రోజుల పాటు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచే లక్ష్యంతో ఆప్కోను బలోపేతం చేస్తున్నామన్నారు. ఆప్కోలో డిజిటలైజేషన్ చేపట్టామని తెలిపారు. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయని తెలియజేశారు.

====================

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం, రాజాపేట గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ బాలుర గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలోని ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె రామారావు, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్.ఎస్.వి.వి.ఎస్. బ్రహ్మాజీ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మార్చి నెల 31వ తేదీ లోపు aprs.apcff.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

=====================
=====================